క్లుప్తంగా

టిప్పర్ల వేగానికి కళ్లెం ఏదీ..?



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న . ధరణాలకోట శ్రీను, నాయకులు

ప్రత్తిపాడు: మండలంలోని టిప్పర్ల వేగానికి కళ్లెం వేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉండే ప్రత్తిపాడు మెయిన్ రోడ్డు గుండా ఎర్రమట్టి, నల్ల కంకర తదితర పరిమితికి మించి లోడ్లతో, మితిమీరిన వేగంతో దూసుకుపోతున్నాయన్నారు. పాఠశాలలకు వెళ్లే పిల్లలు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు ప్రాణాలరచేత పట్టుకుని, బిక్కుబిక్కుమంటూ పయనిస్తున్నారన్నారు. గ్రామంలోనైనా లారీల వేగాన్ని నియంత్రించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సూర్యప్రభకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ నాయకులు కందిమళ్ల సామ్యేలు, కె.నాగేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమఫలితాలు సాధించాలి



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ఎంపీపీ బుజ్జి, కౌన్సిలర్లు

ఏలేశ్వరం: పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల, గురుకుల పాఠశాల, ఎంపీపీ పాఠశాలల్లో సోమవారం విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ గొల్లపల్లిబుజ్జి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూదినారాయణస్వామి చేతుల మీదుగా విద్యార్థులకు కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నామని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉత్తమఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మామిడి శ్రీను, గట్టిం వెంకటరమణ, రెడ్డి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలపై నిరంతరం నిఘా



విద్యార్థులతో మాట్లాడుతున్న పట్టణ సీఐ గీతారామకృష్ణ

తుని: పట్టణ పరిధిలో ఉన్న పాఠశాలలు, కాలేజీల వద్ద సంచరించే ఆకతాయిలపై గట్టి నిఘా పెట్టినట్లు పట్టణ సీఐ గీతారామకృష్ణ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు సోమవారం పలు పాఠశాలలు, కాలేజీలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఉన్నతంగా చదువుకొని భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. డ్రగ్స్, అసాంఘిక కార్యకలాపాల జోలికి వెళ్లి జీవితాన్ని సర్వనాశనం చేసుకొవద్దని సూచించారు. విద్యాసంస్థల వద్ద నిరంతర నిఘా ఉంటుందని, నిబంధనలు అతిక్రమంచిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థు పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉపాధ్యాయులు, సిబ్బందికి అవగాహన కల్పించారు.

ఉపాధి పథకంపై విచారణ చేపట్టాలి

గోకవరం: రాష్ట్ర వైఎస్ఆర్ సీపీ పంచాయతీ రాజ్ చైర్మన్ వెన్నపూసల రవీందర్‌రెడ్డి పిలుపు మేరకు పార్టీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సుంకర వీరబాబు, గోకవరం ఎంపీపీ సంకర శ్రీవల్లి, పలువురు ఎంపీపీలతో కలిసి సోమవారం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డీఆర్‌డీఓకి అందజేశారు. రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతిపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే న్యాయం విచారణ చేపట్టాలని, పథకం చట్టం మేరకు పనులు పంచాయతీల ద్వారానే జరిపించాలని, కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించాలని,ఈ బిల్లులు చెల్లింపులో రాజకీయ జోక్యంను నివారించాలని, సర్పంచులకు ఉన్న అధికారాలను అమలు చేయాలని,పెండింగ్‌లో ఉన్న 9 నెలల జీతభత్యాలు విడుదల చేయాలని,వేతనాలు వెంటనే పెంచాలని వంటి అంశాలపై వినతి పత్రం అందజేశామన్నారు.

తొమ్మిది సారా రహిత గ్రామాలు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో తొమ్మిది గ్రామాలను సారా రహిత గ్రామాలుగా ప్రకటిస్తున్నట్టు ఎక్సైజ్ సీఐ శివప్రసాద్ తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని గజ్జనపూడి, ఏలేశ్వరం మండలంలో పేరవరం, రమణయ్యపేట, శంఖవరం మండలంలో చిన జగ్గంపేట, కొంతంగి, కొత్తూరు, కిర్లంపూడి మండలంలో వీరవరం, వేలంక, బూరుగుపూడి గ్రామాల్లో నాటు సారా తయారీ, విక్రయాలు జోరుగా సాగేవన్నారు. ఇక మీదట ఈగ్రామాల్లో సారా సంబంధిత సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 14405కు ఫోన్ చేయాలని సూచించారు.

తొణికిసలాడుతున్న తాండవ

- జలాశయంలో 368.6 అడుగుల నీటిమట్టం
- అన్నదాత ఖరీఫ్ ఆశలు పదిలం
- ఆగస్టు మొదటిలో నీటి విడుదలకు సన్నాహాలు

కోటనందూరు: తాండవ జలాశయం సాగునీటితో తొణికిసలాడుతోంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు ప్రవాహాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఖరీఫ్‌కు సాగునీటి విడుదలకు ప్రభుత్వ యంత్రాంగం సన్నాహాలు మొదలుపెట్టింది. అన్నీ అనుకులిస్తే ఆగస్టు తొలి వారం నుంచే నీటి విడుదలకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రాజెక్టులో ప్రస్తుతం 368.6 అడుగుల ఆశాజనకమైన నీటి నిల్వలతో అన్నధాత ఖరీఫ్ ఆశలు పదిలంగా ఉన్నాయి. కళకళలాడుతోంది. ఏటా ఖరీఫ్ ప్రారంభంలో జలాశయంలో నీటినిల్వలు లేక, వర్షాలు పడక తెగించి విత్తనాలు చల్లి వర్షం ఎప్పుడు కురుస్తుందా? అని అన్నదాత ఎదురు చూసే పరిస్థితి ఉండేది. అడుగంటిన జలాశయంతో నీటి విడుదలకు ప్రతికూల పరిస్థితులు ఉండేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. నిండుకుండలా ఉన్న ప్రాజెక్టు నుంచి అవసరానికి అనుగుణంగా ఏక్షణంలోనైనా నీటిని విడుదల చేసే పరిస్థితి కనిపిస్తోంది.



సీసీ కాలువలో ప్రవహిస్తున్న సాగునీరు(ఫైల్)

పూర్తి ఆయకట్టు వివరాలిలా..

తాండవ జలాశయ పరిధిలోని మొత్తం ఆయకట్టు 51,465 ఎకరాలు. ఈ ప్రాజెక్టు నుంచి అనకాపల్లి జిల్లాలో 32,500 ఎకరాలు, కాకినాడ జిల్లాలో 18,770 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. జిల్లాలోని కోటనందూరు మండలంలో 13,205 ఎకరాలు, తుని మండలంలో 4,482 ఎకరాలు, రౌతులపూడి మండలంలో 1,089 ఎకరాలకు సాగునీరు అందుతుంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా కనిష్ఠ స్థాయి 340 అడుగులు. ప్రాజెక్టు నిబంధనల ప్రకారం జలాశయంలో 370 అడుగులు నీటి నిల్వలు ఉంటే నీటి విడుదలకు అనుకూలం. ప్రస్తుతం జలాశయంలో 368.6 అడుగుల నీటిమట్టం ఉంది. ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితుల్లో టైలాండు(శివారు)ప్రాంత రైతులు కూడా ఖరీఫ్‌లో నిర్భయంగా నాట్లు వేసుకోవచ్చని ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. జలాశయం నుంచి అనకాపల్లి జిల్లాలో ఉన్న ఎడమ ప్రధాన కాలువ ద్వారా 25,440 ఎకరాలు, కుడి ప్రధాన కాలువ ద్వారా 7,249 ఎకరాలకు నాతవరం, నర్సీపట్నం, కోటవురట్ల మేజర్ కాలువలు ద్వారా సాగునీరు అందిస్తున్నారు. ఈ జిల్లాలో కుడి ప్రధాన కాలువ ద్వారా 11,391 ఎకరాలు, ఎడమ ప్రధాన కాలువల ద్వారా 7,385 ఎకరాలకు కోటనందూరు, ఇండుగపల్లి, భీమవరపుకోట మేజర్ కాలువలు, టైలాండ్ బ్రాంచ్ కెనాల్ (టీఈబీసీ)ల ద్వారా ఆయకట్టు అవసరాలకు సాగునీరు అందిస్తున్నారు.

సీసీ కాలువలతో ప్రయోజనం

గతంలో కాలువల అభివృద్ధికి నోచుకోక తాండవ నీరు శివారు ప్రాంతాలకు చేరేది కాదు. జలాశయం నుంచి నీటిని విడుదల చేసిన తరువాత కోటనందూరు మండలానికి రావడానికి చాలా సమయం పట్టేది. సాగు నీరు భూమిలో ఇంకిపోయి ఆశించిన స్థాయిలో పొలాలకు చేరేది కాదు. దీంతో ఆయకట్టు అవసరాలకు సాగునీటి సమస్య తలెత్తేది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ తాండవ కాలువల సీసీ లైనింగు పనుల కోసం రూ. 55 కోట్లు మంజూరు చేశారు. పనులు పూర్తయి నేడు శివారు ప్రాంతాలకు సైతం పుష్కలంగా నీరు చేరే అవకాశం ఏర్పడింది.



సాగునీటితో కళకళలాడుతున్న తాండవ జలాశయం

నీటి విడుదలపై నిర్ణయం..

తాండవ ప్రాజెక్టు అభివృద్ధి కమిటీ, ఆయకట్టు రైతులు, వ్యవసాయశాఖ అధికారులతో జులై రెండవ వారంలో సమావేశం ఏర్పాటు చేసి నీటి విడుదలపై నిర్ణయం తీసుకుంటామని తాండవ అధికారులు చెబుతున్నారు. అన్ని అనుకులిస్తే ఆగస్టు తొలి వారం లోనే నీటిని విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆయకట్టు అవసరాలు, రైతుల అభీష్టం మేరకు నీటి విడుదలపై తేదీ నిర్ణయిస్తామని వివరించారు.

మెండుగా నీటి నిల్వలు



తాండవ జలాశయంలో ప్రస్తుతం 368.6 అడుగుల నీటినిల్వలు ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో రైతుల అవసరాలకు అనుగుణంగా 50 రోజుల వరకు నీటిని విడుదల చేయగలం. టైలాండ్ ప్రాంత రైతులు సైతం ధైర్యంగా నాట్లు వేసుకోవచ్చు. ఖరీఫ్‌లో 100 శాతం ఆయకట్టుకు నీరందించేదుకు చర్యలు తీసుకుంటున్నాం.

– అనురాధ, డీఈఈ, తాండవ జలాశయం

సమస్యలపై గళమెత్తిన కౌన్సిల్

- అక్రమ దుకాణాలను తొలగించండి
- మున్సిపల్ పార్కుకు నిధుల కేటాయింపు

తుని: పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్యలపై కౌన్సిల్ సమావేశంలో సోమవారం సభ్యులు గళమెత్తారు. వర్షాకాలంలో వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు నిర్వహించారు. అజెండాలో పొందుపరిచిన 28 అంశాలను ఆమోదించించారు.

నిధుల కేటాయింపు

పట్టణంలోని రాజా రాజబాబు మున్సిపల్ పార్కు అభివృద్ధికి రూ.50 లక్షలు, కుక్కల నియంత్రణ, పశువుల ఆసుపత్రిలో సామాగ్రి కొనుగోలుకు రూ.9 లక్షలు నిధులు కేటాయించినట్టు సీపీ సుందరి తెలిపారు. జీరో ఆవర్లో కౌన్సిలర్లు ఆయా వార్డులకు సంబంధించిన సమస్యలను ప్రస్తావించారు. దుర్గాదాస్ వీధిలో సీసీ రోడ్డు నిర్మించాలని కౌన్సిలర్ కనిగిరి వెంకటరమణ అధికారులను కోరారు. వెంకటేశ్వర స్వామి ఆలయం రోడ్డులోని మోగా కాలువలో సిల్ట్ పేరుకు పోయిందని, అధికారులు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ పామర్తి మహేష్ కోరారు. రాజీవ్ గృహ కల్పలో శానిటేషన్ మెరుగు పర్చాలని, డ్రైవర్స్ కాలనీలో సీసీ కాలువ నిర్మాణానికి అడ్డంగా ఉన్న కరెంట్ పోల్‌ను మార్చాలని ఆయా వార్డులకు చెందిన కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.



కౌన్సిల్‌లో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి

ఆక్రమాణలను తొలగించాలి

బాలాజీ సెంటర్, బాలికల ఉన్నత పాఠశాల సెంటర్లలో తరచు ట్రాఫిక్ సమస్య, ఈవ్ టీజింగ్ ఎక్కువగా ఉందని సీపీ దృష్టికి తీసుకువచ్చారు. మార్కెట్ యార్డు రోడ్డులో విచ్చలవిడిగా బడ్డీ కొట్టు పెట్టడం వలన ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని, పోలీసులు దృష్టి సారించి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన బడ్డీలను తొలగించాలని కోరారు. వీరవరపుపేటలో వివాదంలో ఉన్న స్థల సమస్యను న్యాయ సలహా తీసుకుని పరిష్కరించాలని కమిషనర్ వెంకట్రావునను సీపీ ఆదేశించారు. సమావేశంలో కౌన్సిలర్లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు ముద్రగడ పరామర్శ

రౌతులపూడి: గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రౌతులపూడి మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత వాసిరెడ్డి వెంకటేశ్వర్లు (దేవుళ్లను) పార్టీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం, ఆయన తనయుడు, నియోజకవర్గ కోఆర్డినేటర్ గిరిబాబులు సోమవారం పరామర్శించారు. అయన స్వగృహానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులను, యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స తీసుకోని త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. రాజవరంలో ఇటీవల మాతృవియోగం చెందిన పార్టీ నేత సోమరౌతు తరుముల వెంకన్నదొర కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం పార్టీ నేత వాసిరెడ్డి జమీలు జన్మదిన వేడుకుల్లో పాల్గొని కేక్ కట్‌చేసి అభిమానులతో సందడిగా గడిపారు.



మాజీ సర్పంచ్ దేవుళ్లను పరామర్శిస్తున్న ముద్రగడ పద్మనాభం, గిరిబాబులు

శ్రేణులకు దిశానిర్దేశం

రౌతులపూలో పర్యటించిన ముద్రగడ మండల పార్టీశ్రేణులతో కలసి పార్టీ అభివృద్ధి పైన, భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీపై కార్యకర్తలంతా సమిష్టిగా పనిచేసి ప్రభుత్వ ఎన్నికల్లో ఇచ్చిన మోసపూరిత హామీలు గురించి ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీశివకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సూరెడ్డి రాయల్‌సాయి, మండల కన్వీనర్ సత్యన్నారాయణ, రైతు విభాగం కార్యదర్శి కాకి నాని, బీసీ విభాగం ప్రతినిధి గొల్లు వెంకటరమణ, పార్టీ నాయకులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీలతో కౌశలం అభివృద్ధి

కిర్లంపూడి: వక్తృత్వ పోటీలతోనే విద్యార్థులలో కౌశలం అభివృద్ధి చెందుతుందని సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి జగన్ మోహన్ అన్నారు. మండలంలోని తామరాడ జెడ్పీ పాఠశాల ప్లస్‌లో జరిగే అకడమిక్ కార్యక్రమాలను సోమవారం ఆయన పరిశీలించారు. సహపాఠ్య కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములు కావడంతో సమగ్ర అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎల్. కృష్ణ, ఉపాధ్యాయులు బావిశెట్టి లక్ష్మీనారాయణ, తిరగటి విజయరత్నం, డి.చంద్రశేఖర్, వై.ఏసుబాబు, శ్రీనివాస్ ఉన్నారు.

ముదునూరి ఆర్థిక సాయం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం గ్రామంలో బాధిత కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకులు ముదునూరి మురళీ కృష్ణంరాజు సోమవారం పరామర్శించారు. గ్రామానికి చెందిన మట్ట లచ్చయ్య కుమార్తె సుజాత దంపతులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. పరిస్థితి తెలుసుకుని బాధిత కుటంబాన్ని ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని రూ.ఐదు వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మచ్చర్ల దాసు, కుప్పిన శ్రీను, తూపాటి బాబ్జి, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు, మచ్చర్ల రాజు, కుప్పిన నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న మురళీ కృష్ణంరాజు

ఎప్పుడు జమ చేస్తారు..?

- ఖరీఫ్ వస్తున్నా ధాన్యం సొమ్ములు వేయరా
- నట్టేట ముంచుతున్న కూటమి ప్రభుత్వం

జగ్గంపేట: కూటమి ప్రభుత్వం రైతులను నట్టేట ముంచుతోందని, ఖరీఫ్ వస్తున్నా రైతులకు పెట్టుబడి పెట్టడానికి చేతిలో చిల్లిగవ్వ లేకుండా చేస్తోందని మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తోట నరసింహం ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం అయన మాట్లాడుతూ రైతులు రబీ ధాన్యానికి గత ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ డబ్బులు వేయలేదని విమర్శించారు. నియోజకవర్గంలో అకాల వర్షాలతో సుమారు 1,500 టన్నుల ధాన్యం తడిసి ముద్దవడంతో రైతులు ఆవేదనను ప్రతిపక్ష నేతలుగా ప్రభుత్వంపై ఒత్తిడి చేశామన్నారు. పౌరసరఫరాల మంత్రి హడావిడిగా జిల్లాకు విచ్చేసి తడిసిన ప్రతి ధాన్యం గింజాకొంటామని హామి ఇచ్చి కొనుగోలు చేశారని గుర్తు చేశారు. కాని వాటికి సంబంధించిన డబ్బులు ఇప్పటికి ఖాతాలకు జమకాలేదన్నారు. రైతులకు మా ప్రభుత్వంలో పెట్టుబడిగా రైతు భరోసా చెల్లించేదని, పథకం పేరు మార్చినా అమలు చేయలేదని తెలిపారు. చాలా మంది రైతులను అనర్హులుగా గుర్తించి మోసం చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తోట శ్రీరాంజీ, జగాల్, పార్టీ నేతలు రామకుర్తి మూర్తి, గండేపల్లి ఎంపీపీ దొరబాబు, నియోజకవర్గ నేతలు కరుటూరి వీర్రాజు,గుర్రం మహాలక్ష్మి, పెదకాపు, మండల నేతలు రావుల గణేష్‌రాజా, రామకృష్ణ, గణపతి, తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తోట నరసింహం

పచ్చదనానికి కృషి చేయాలి

తుని: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని తుని వాకర్స్ హెల్త్ క్లబ్ పాస్ట్ గవర్నర్ చదరం శివాజీ అన్నారు. సోమవారం ఫీడర్ రోడ్డులో వాకర్స్ హెల్త్ క్లబ్ ఉపాధ్యక్షుడు కండవల్లి జోసఫ్ ఆధ్వర్యంలో 200 మందికి మొక్కలను పంపిణీ చేశారు. పట్టణంలో పచ్చదనం కోసం చేపట్టిన కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. కుందెం సత్యనారాయణ, గాజుల వేణు గోపాలకృష్ణ, పి.శివ, వాడపల్లి శ్రీనివాస్, నెల్లిపూడి నాగేశ్వరరావు, దాసరి నాగరాజు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్‌కు అవార్డుల వెల్లువ

తుని: తుని రోటరీక్లబ్ 24 విభాగాల్లో అవార్డులను కైవసం చేసుకుందని అధ్యక్షుడు సీహెచ్. మంగరాజు సోమవారం తెలిపారు. ఆదివారం రాజమహేంద్రవరంలో జరిగిన రోటరీ డిస్ట్రిక్ 3020 అవార్డు కార్యక్రమంలో తుని శాఖకు అవార్డులను డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అధ్యక్షుడు మంగరాజు, కార్యదర్శి ఎస్.వీర్రాజులు అందుకున్నారు. ఉత్తమ అసిస్టెంట్ గవర్నర్‌గా ఎస్.పద్మావతి, పోలియో ఫండ్ నిమిత్తం సీహెచ్.విజయ్‌ప్రకాష్, శెట్టి నాగభూషణంలకు అవార్డులు దక్కాయి. అవార్డులతో తుని శాఖకు బాధ్యత పెరిగిందని, భవిష్యత్‌లో సేవా కార్యక్రమాలను ముమ్మరం చేస్తామని పేర్కొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

రాయవరం: మండలంలోని వెదురుపాక మోడల్ ప్రైమరీ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు షూస్, సాక్సులు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం కె.అర్జునుడు ఆధ్వర్యంలో పాఠశాలలోని 51 మంది విద్యార్థులకు ఎంఈవో-2 వై.సూర్యనారాయణ చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తోన్న సేవలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. హెచ్‌ఎంలు పాఠశాలకు వచ్చిన ఎస్‌ఆర్‌కేవీఎం కిట్స్‌లోని సామగ్రిని వెంటనే అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుంటూరి అప్పారావు, బి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానానికి చేసిన సేవలు మరువలేనివి

అన్నవరం: సత్యనారాయణ దేవస్థానానికి ఏఈఓ కే.కొండలరావు అందించిన సేవలు మరువలేనివని దేవాదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ త్రినాధరావు అన్నారు. దేవస్థానంలో సుమారు 35 సంవత్సరాలు వివిధ హోదాల్లో పనిచేసి ఏఈఓగా పదవీ విరమణ చేసిన కే.కొండలరావు దంపతులను దేవస్థానం సిబ్బంది సోమవారం ఘనంగా సత్కరించారు. ఈఓ వీర్ల సుబ్బారావు ఆయన అందించిన సేవలను ప్రస్తుతించారు. విశ్రాంతి ఏఈఓలు గోవిందరావు, ఎస్. రామచంద్రరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సంఘటితం కావాలి

ప్రత్తిపాడు: ఫొటో, వీడియోగ్రాఫర్లు సంఘటితం కావాలని సంఘం అధ్యక్షుడు, అంతర్జాతీయ ఛాయాచిత్ర అవార్డు గ్రహీత సలాది కృష్ణ కోరారు. లయన్స్ క్లబ్ కల్యాణ మండపంలో సోమవారం ఫొటోగ్రాఫర్ల సంఘ సమావేశం జరిగింది. ఫొటోగ్రాఫర్లు బీమా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టిప్పర్ల రాకపోకలను నివారించండి

శంఖవరం: వేగంతో పాటు అధికలోడుతో, ప్రమాదభరితంగా రాకపోకలు చేస్తున్న టిప్పర్లను నిలిపివేయాలని వివిధ గ్రామస్తులు డిమాండ్ చేశారు. మండలంలోని కత్తిపూడి శివారు క్రషర్ మిషన్ల సమీపంలో సోమవారం వేగంగా వచ్చిన లారీ కుక్కను ఢీకొంది. దీంతో సంఘటనా స్థలంలో కుక్క మృతి చెందింది. దీంతో స్థానికులు మనుషులు అయినా అంతే అంటూ గ్రామస్తులు రోడ్డుపై బైటాయించారు. లారీల యాజమన్యంపై కేసు నమోదుచేయాలని డిమాండ్ చేశారు. మరోక వైపు భారీ బండరాళ్లు జారి పడుతున్నాయన్నారు. లారీలను నిలిపివేయకపోతే అందోళన మరింత ఉధృతం చేపడతామని హెచ్చరించారు. అన్నవరం పోలీసులు ఇరువర్గాలతో చర్చించి పరిష్కార మార్గాలు చూపుతామన్నారు.